నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 11 మే 2024 | RANGAREDDY



తాండూరు : సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

# కాంగ్రెస్‌కు కష్టమే..

- అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగింట గెలిచి పటిష్ట స్థితిలో బీఆర్ఎస్
- ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కు 65వేల పైచిలుకు ఆధిక్యం
- పార్టీ ఫిరాయించిన రంజిత్‌రెడ్డికి ముచ్చెమటలే!
- పాత, కొత్త నేతల మధ్య కొనసాగుతున్న వైరుధ్యాలు
- లోక్‌సభ ఎన్నికల ఫలితంపై ప్రభావం చూపనుండడంతో కాంగ్రెస్‌లో ఆందోళన
- టాప్ గేర్‌లో దూసుకుపోతున్న 'కారు'

రంగారెడ్డి, మే 10 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చి పవర్‌లోకి రావడం.. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం..అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఇచ్చిన హామీల్లో ఒక్క దానిని కూడా సక్రమంగా అమలు చేయకపోవడంతో లోక్‌సభ ఎన్నికలు ఆ పార్టీకి సవాల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయించి కాంగ్రెస్ తరపున ఎంపీగా బరిలో ఉన్న రంజిత్‌రెడ్డి చేవెళ్ల ఎన్నికల్లో అసలు పరీక్షను ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కాంగ్రెస్‌కు చేవెళ్లలో విజయం అనేదే లేకపోగా..సొంత పార్టీలోనే నెలకొన్న సహాయ నిరాకరణ పరిస్థితులు రంజిత్‌రెడ్డికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో గెలిచి పటిష్ట స్థితిలో ఉన్న కారు చేవెళ్లలో దూసుకుపోతుండగా..కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం వెంటాడుతున్నది.

## పటిష్ట స్థితిలో బీఆర్ఎస్..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచే చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉన్నది. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు వరుసగా విజయం సాధించారు. అసెంబ్లీ ఫలితాల్లో ఇతర ప్రాంతాలకు భిన్నంగా ప్రజలు తీర్పునిచ్చి లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పక్షానే నిలిచారు. ఈ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో.. చేవెళ్ల, మహేశ్వ రం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీల్లో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ పార్టీకి 65 వేల పైచిలుకు ఓట్లు అధికంగా వచ్చాయి. దీంతో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజల నుంచి ఇదే ఆదరణ లభిస్తుందని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## కాంగ్రెస్‌కు ప్రతికూల పరిస్థితులు..

చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఎదురీదుతున్నారు. ఓవైపు సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వస్తుండడం ..బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో వివిధ వర్గాల వారి సహాయ నిరాకరణ అతడిని కలవరపెడుతున్నది. కొత్త, పాత నేతల మధ్య వైరుధ్యాలు నేటికీ అక్కడక్కడా కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల నేతలు సహకరించడం లేదు. ఇవన్నీ ప్రస్తుత ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుండడంతో కాంగ్రెస్ పార్టీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. నేతల మధ్య సమన్వయం తీసుకొచ్చేందుకు అగ్రనేతలు చొరవ చూపకపోవడంతో ప్రచారంలోనూ కొందరు నేతలు పాల్గొనడం లేదని తెలుస్తున్నది. దీనికితోడు క్షేత్రస్థాయిలోనూ పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా లేవు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కరువు పరిస్థితులు ఏర్పడి పంటలు ఎం డిపోయాయి. అంతేకాకుండా రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలు పత్తాలేకుండాపోయాయి. రూ.500 బోనస్‌ను సైతం కాంగ్రెస్ పార్టీ అటకెక్కించింది. రైతులు కష్టకాలంలో ఉన్నా కనీసం ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికల నాటి హామీలను గాలికొదిలేసిన కాంగ్రెస్‌పై సబ్బండ వర్ణాల వారు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానానికి దిగజారినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్న టాక్ వినిపిస్తున్నది.

## టాప్ గేర్‌లో 'కారు'..

చేవెళ్లలో కారు టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ప్రచారంలో దూకుడుగా వెళ్తున్నారు. ద్విముఖ వ్యూహంతో వెళ్తున్న బీఆర్ఎస్‌కు చేవెళ్లలో పరిస్థితులు రోజురోజుకూ అనుకూలంగా మారుతున్నాయి. కాసాని జ్ఞానేశ్వర్ బీసీ నేత కావడంతో బీసీ నినాదాన్ని నేతలు ప్రచారంలో బలంగా జనంలోకి తీసుకెళ్తున్నారు. దీంతో చేవెళ్ల లోక్‌సభలో మెజార్టీగా ఉన్న బీసీ ఓటర్లు ఏకతాటిపైకి వచ్చి కాసానిని గెలిపించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. మరోపక్క కాంగ్రెస్, బీజేపీ పాలన వైఫల్యాలను ప్రచారాస్త్రంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలంతా కదనరంగంలో ముందు కు సాగుతున్నారు. క్యాడర్ సైతం సమరోత్సాహంతో కాసాని గెలుపుకోసం కదం తొక్కుతున్నది. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నీ తానై కాసాని గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభలో బీఆర్ఎస్ గత వైభవాన్ని చాటుతుందన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతున్నది.



తాండూరు సభకు భారీగా హాజరైన జనం

# ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

- దేవుళ్లపై ఒట్టేసే రేవంత్ ఝూటా సీఎం
- మతరాజకీయాలు చేసే మోదీ మాటలు నమ్మొద్దు
- బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- తాండూరు, పెద్దేముల్ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల ఆశీర్వాద సభ.. పరిగిలో బీఆర్ఎస్ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

తాండూరు/పరిగి, మే 10 : లోక్‌సభ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని, స్వార్థం కోసం పార్టీలు మారే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తాండూరు పట్టణం, తాండూరు, పెద్దేముల్ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల ఆశీర్వాద సభ..అదేవిధంగా పరిగిలోని ఎస్ గార్డెన్‌లో జరిగిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె.. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలన తెలంగాణలో స్వర్ణయుగమన్నారు. ప్రపంచ దేశాలు తెలంగాణ రాష్ట్రం వైపు చూసేలా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని కొనియాడారు. బీఆర్ఎస్ అధినేత చేపట్టిన బస్సు యాత్రకు రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుండడంతో ఓటమి భయం పట్టుకున్న బడేభాయ్, చోటేభాయ్ ఒక్కటై కుట్ర పన్ని కేసీఆర్‌ను రెండు రోజులపాటు మాట్లాడనీయలేదని మండిపడ్డారు. కేసీఆర్ వరంగల్‌లో మాట్లాడితే పరిగిలో ఉన్న ఓ అమ్మ స్పందిస్తున్నదని, కరీంనగర్‌లో మాట్లాడితే ఇక్కడి రైతు స్పందిస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్‌ను ఓడగొట్టి పొరపాటు చేశామనే భావన ప్రజల్లో ఉందన్నారు. ఆయన్ను మళ్లీ సీఎంగా తెచ్చుకోవాలని, మరోసారి ఎలాంటి పొరపాటు చేయొద్దని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని.. ప్రతి వ్యక్తికీ సంక్షేమ పథకం అందిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని. బీఆర్ఎస్ అధినేత లొల్లి పెట్టడంతోనే రేవంత్ ప్రభుత్వం రైతుబంధు నిధులను వేసిందన్నారు. కానీ..ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఇచ్చిన హామీల్లో ఒక్క దానిని కూడా సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో రైతులు గోస పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడికెళ్లినా దేవుళ్లపై ప్రమాణాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఝూటా సీఎం రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. మతరాజకీయాలు చేసే బీజేపీ మాటలను నమ్మొద్దన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతినిత్యం పరితపించే బీఆర్ఎస్‌కే ప్రజలు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. రేవంత్‌రెడ్డి పాలనలో ఆడవారు కనిపిస్తే చాలు బస్సులు స్పీడ్‌గా వెళ్తున్నాయన్నారు.ఆయా కార్యక్రమాల్లో జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ రాజాగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి, బీఆర్ఎస్ నియో జకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి గట్టు రాంచందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు కాసాని వీరేశ్, కొప్పుల అనిల్‌రెడ్డి, నయీం, వీరేందర్‌రెడ్డి, ఆర్.ఆంజనేయులు, ఎంపీపీలు అరవిందరావు, అనురాధ, జడ్పీటీసీలు మంజుల, హరిప్రియ, కోహిర్ శ్రీనివాస్, అశోక్, శ్యాంసుందర్‌రెడ్డి, సురేందర్, రాజేందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుభాష్ చందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సునంద, రామన్నమాదిగ, విజయ్‌ఆర్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు.. :

-కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి. గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటా. జడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేశా. బీసీల సమస్యలపై మంచి అవగాహన ఉన్నది. ఓట్ల కోసం ఎన్నికల్లో మాయమాటలు చెబుతున్న బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మొద్దు.

### వెన్నుపోటుదారులకు బుద్ధి చెప్పాలి


-స్వామిగౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్

రాష్ట్రాభివృద్ధికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చక్కటి విజన్‌తో పనిచేశారు. ప్రజలకు కావాల్సిన అన్ని వసతులు కల్పించారు. రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలను భూస్థాపితం చేయాలి. పదవుల కోసం పార్టీలు మారే వెన్నుపోటుదారులకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలి. బీసీ, బడుగు, బలహీన వర్గాల నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

### హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం..

-కొప్పుల మహేశ్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే

సబ్బండ వర్ణాల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పాలన సాగింది. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం అందింది. అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన పొరపాట్లు ఇప్పుడు చేయొద్దు. అమలు కు సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఐదు నెలల కాలంలో ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదు. రేవంత్‌రెడ్డి పాలన గాడి తప్పింది. ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందిపడుతున్నారు. రైతుబంధు కింద పదకొండు పర్యాయాలు కేసీఆర్ పెట్టుబడి సాయాన్ని అందించారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పటివరకు అమలు చేయలేదు. విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలకు బుద్ధి చెప్పాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.



### చేవెళ్ల గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా ..

-పంజుగుల రోహిత్‌రెడ్డి, తాండూరు మాజీ ఎమ్మెల్యే

చేవెళ్ల పార్లమెంట్ గడ్డ..బీఆర్ఎస్ అడ్డా. ఈ ప్రాంత ప్రజలకు తెలియని రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను కేసీఆర్ చెప్పారని ఎంపీలుగా గెలిపించుకున్నాం. అయితే వారే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రత్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వారికి ఓటుతో బుద్ధి చెప్పేందుకు ఈ ప్రాంత ప్రజలు సిద్ధంగా ఉన్నారు. వికారాబాద్ జిల్లా అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని గెలిపించుకోవాలి. వికారాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలను ఓడించేందుకు కుట్ర చేసిన ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డికి తగిన గుణపాఠం చెబుతాం. వారు ఎక్కడ నిలబడ్డా రిటర్న్ గిఫ్టు ఇస్తాం. తాండూరు బిడ్డగా ఊపిరి ఉన్నంత వరకు ఈ ప్రాంత ప్రజలకు సేవ చేస్తా.



# ఆపదని తెలిస్తే వాలిపోతా..

- అవసరం ఉంటేనే వచ్చే మనిషిని కాదు..
- కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలి
- బీఆర్ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్
- తట్టిఅన్నారంలో కాలనీల ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం

పెద్దఅంబర్‌పేట, మే 10 : కేవలం ఎన్నికలప్పుడే వచ్చి మాటలు చెప్పే మనిషిని కాదని, ఆపదని తెలిస్తే వాలిపోతానని బీఆర్ఎస్ పార్టీ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. శుక్రవారం ఉదయం తట్టిఅన్నారం జీవీఆర్‌కాలనీలో పలు కాలనీల ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరం ఉంటేనే వచ్చే మనిషిని కాదని, మీ కుటుంబంలో ఒకడి గా ఉంటానన్నారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలన చూసిన తర్వాత ప్రజలు విసిగి పోతున్నారని.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రజల్లో విపరీతమైన సానుభూతి పెరిగిందని చెప్పారు. భువనగిరి పార్లమెంట్ బరిలో 39మంది ఉంటే అందులో ఏ ఒక్క కేసూ లేని, మచ్చలేని వ్యక్తిని తానేనని పేర్కొన్నారు. ప్రజాశ్రేయస్సును కాంక్షించే బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించి, మీ కుటుంబసభ్యుడిగా ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని.. ఎంపీగా గెలిపిస్తే తిరిగొచ్చి మీ మధ్యే ఉంటానని మాటిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంతుల వెంకటేశ్వర్‌రెడ్డి, దేవిడి విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఈదమ్మల బలరాం, పాశం దామోదర్, రావుల గోపాల్‌గౌడ్, కౌన్సిలర్లు పరశురాంనాయక్, మండల కోటేశ్వర్‌రావు, నాయకులు సూరయ్య, భిక్షపతి, వివిధ కాలనీల ప్రతినిధులు భాస్కరాచారి, రామ్మోహన్‌రావు, మానయ్య, విజయ్‌మోహన్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో కాలనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

# ప్రచారానికి నేటితో ఆఖరు..

- చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గమంతటా ప్రచారంలో పాల్గొనేలా పార్టీల అభ్యర్థుల ప్లాన్
- వికారాబాద్ జిల్లాలో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం
- కాసాని గెలుపే లక్ష్యంగా ముందుకు..
- నేడు వికారాబాద్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. తాండూరుకు ప్రియాంకగాంధీ రాక
- ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచార సభల్లో పాల్గొననున్న నేతలు



వికారాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల ప్రచారం నేటితో ముగియనున్నది. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి సమావేశాలు, ర్యాలీలు, మైకులు మూగబోనున్నాయి. దాదాపు రెండు నెలలపాటు ఆయా పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించాయి. అయితే నేటి సాయంత్రం 5 గంటల నుంచి ఈ నెల 13న పోలింగ్ ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉండనున్నది. పోలింగ్‌కు ముందు 48 గంటల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ సోషల్ మీడియా, పత్రికలు, ఎల్రక్టానిక్ మీడియాల్లో చర్చలు తదితరాలను ప్రచారం చేయొద్దని.. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని ఎన్నికల సంఘం సూచించింది. అయితే ప్రచారం ముగియడంతో ఓటర్లను డబ్బు, మద్యంతో ప్రలోభపెట్టే అవకాశాలున్న దృష్ట్యా జిల్లా ఎన్నికల యంత్రాంగం పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లాలో ఇప్పటికే ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలుండగా, మరో 6 బృందాలు నేటి సాయంత్రం 5 గంటల నుంచి తనిఖీలను ముమ్మరం చేయనున్నాయి. అదేవిధంగా అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసేందుకు వచ్చిన వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు నేటి సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా నుంచి వెళ్లిపోవాలని ఎన్నికల సంఘం అధికారులు ఆదేశించారు.

## ఆఖరి రోజు..జోరుగా ప్రచారం..

నేటి సాయంత్రంతో మైకులు మూగబోనున్నాయి. శనివారం ప్రచారానికి ఆఖరి రోజు కావడంతో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గమంతటా విస్తృతంగా పర్యటించేలా ఆయా పార్టీల అభ్యర్థులు ప్లాన్ చేసుకున్నారు. నేడు చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి సుడిగాలి పర్యటన చేసేలా బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ప్రణాళికను సిద్ధం చేసుకున్నా రు. దాదాపు రెండు నెలలుగా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఎక్కడికెళ్లినా స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు పలుకుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలకు సుపరిచితుడు, బీసీ బిడ్డ కావడంతో బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా బీఆర్ఎస్ అభ్యర్థి కాసానికి మద్దతు తెలుపుతూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. కాసానిని గెలిపించడమే ధ్యేయంగా మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ప్రచారంలో పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నారు. చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గంలోని చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి, రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి కాసానికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తూ.. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ.. ఐదు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజల ముందు ఎండగడుతున్నారు.

## వికారాబాద్‌కు అమిత్‌షా, తాండూరుకు ప్రియాంక..

లోక్‌సభ ఎన్నికల ప్రచారం నేటితో పరిసమాప్తి కానున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల స్టార్ క్యాంపెయినర్లు నేడు జిల్లాలో తమ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచార సభల్లో పాల్గొననున్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా నేడు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీఅనంతపద్మనాభ కాలేజీ మైదానంలో జరుగనున్న బహిరంగసభలో కేంద్రమంత్రి అమిత్‌షా పాల్గొననున్నారు. అదేవిధంగా కాం గ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా తాండూరు పట్టణంలో నిర్వహించే ప్రచార సభకు ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్ ప్రియాంకాగాంధీ హాజరు కానున్నారు. రంజిత్‌రెడ్డిని ఓడించేందుకు సొంత పార్టీ నేతలే ప్లాన్ చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఈ ఎన్నికల్లో ఆయన పొరపాటున విజయం సాధిస్తే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేలను డమ్మీలుగా చేసి చక్రం తిప్పుతారని.. అందువల్ల అతడిని ఓడించేందుకు సొంత పార్టీ నేతలే వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని సమాచారం..!

# ఆటంకాల్లేకుండా పోలింగ్ నిర్వహించాలి

-సెక్టోరల్ అధికారుల శిక్షణా తరగతుల్లో రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక



రంగారెడ్డి, మే 10 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజా వుగా జరిగేలా సెక్టోరల్ అధికారులు కృషి చేయాలని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్ టీఎస్ఐఆర్డీలో రాజేంద్రనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియ కు సంబంధించి సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా కలెక్టర్ అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రక్రియకు ఆటంకాలు తలెత్తకుండా, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. అదనపు పోలింగ్ సామగ్రి తమ వద్ద అందుబాటులో ఉండేలా సెక్టోరల్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవడం, చెక్ చేయడం వంటివి చేయొద్దన్నారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ ప్రారంభమయ్యేలా చూడాలని, ఏజెంట్లు రాని పక్షంలో 15 నిమిషాలు వేచి చూసి మాక్‌పోలింగ్‌ను జరిపించాలన్నారు. మాక్‌పోల్, పోలింగ్ ప్రక్రియల సందర్భంగా ఎక్కడైనా ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే, సెక్టోరల్ అధికారులు వెంటనే స్పందించి తమ వద్ద రిజర్వ్‌లో ఉంచిన యూనిట్లను సమకూర్చాలన్నారు. 17-సీ డాక్యుమెంట్, పీవో డైరీ, విజిట్ షీట్, మాక్ పోల్ సర్టిఫికెట్, 17 కాలమ్ ప్రొఫార్మా వంటివి తప్పుల్లేకుండా సక్రమంగా పూరించాలన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను జాగ్రత్తగా రిసెప్షన్ సెంటర్లకు చేర్చాలని, వాటిని సరిచూసుకుని స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచే వరకు సెక్టోరల్ అధికారులు అక్కడే ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ తరగతుల్లో రాజేంద్రనగర్ ఆర్డీవో, సహాయ రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి, సెక్టోరల్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

### పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర సీఈవో వికాస్‌రాజ్ సూచించారు. ఈ నెల 13న జరుగనున్న పోలింగ్ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్, ఓటరు స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవీఎంల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామగ్రి పంపిణీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు.